క్లుప్తంగా

హాస్టల్‌ను పరిశీలించిన న్యాయమూర్తి



భోజనాలను తనిఖీ చేస్తున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి రామకృష్ణ

నిడదవోలు: మండలంలోని సమిశ్రగూడెం సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహాన్ని గురువారం రాత్రి నిడదవోలు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రామకృష్ణ తనిఖీ చేశారు. ఈ హాస్టల్‌లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. వారికి అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. హాస్టల్ స్థితిగతులు, వంట గది, మరుగుదొడ్లను పరిశీలించారు. హాస్టల్లోని సదుపాయాల గురించి వార్డెన్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని న్యాయమూర్తి రామకృష్ణ పరిశీలించారు.మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమములో లీగల్ ఎయిడ్ న్యాయవాదులు ఏస్‌కే జమీల, ఏఎస్ విశ్వనాథ్, యుఎంఎల్ఎస్ ప్రసన్న, ఏఎస్సై జీఆర్‌కే గంగాధర్, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కొవ్వూరులో జాతీయ బృందగాన పోటీలు

కొవ్వూరు: భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 20న జాతీయ బృంద గాన పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మంటపంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ఈ పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్టు ప్రకటించారు.

గ్రామాల్లో అన్న సమారాధనలు

చాగల్లు: శరన్నవ రాత్ర ఉత్సవాలు ముగిసిన సందర్భంగా మండలంలోని రెండు చోట్ల శుక్రవారం అన్న సమారాధనలు నిర్వహించారు. మీనానగరంలో మత్యాలమ్మ దిబ్బ వద్ద గల అమ్మవారి ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. చాగల్లు ఇందిరమ్మ కాలనీ, పంగిడి తదితర ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. చాగల్లు మాతంగి చెరువు గట్టుపై గల కనకదుర్గమ్మ ఆలయం వద్ద అన్నదానం చేశారు.


క్షతగాత్రులకు ఆర్థిక సాయం

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడేనికి చెందిన వసంతాడ మధుబాబు దంపతులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని నల్లజర్ల అంబేడ్కర్ యూత్ సభ్యులు శుక్రవారం ఆసుపత్రిలో పరామర్శించి, రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొందల శ్రీనివాసరావు, గుదే శ్రీనివాస్, ప్రత్తి వినోద్‌కుమార్, కూరపాటి నాగరాజు పరామర్శించిన వారిలో ఉన్నారు.

నవంబర్‌లో రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు

దేవరపల్లి: నవంబర్ నెలకు మండలంలోని రేషన్ దుకాణాల ద్వారా నూరు శాతం కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేయనున్నట్టు మండల పౌరసరఫరాల విభాగం డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. కార్డుకు కిలో కందిపప్పు రూ.67, అర కిలో పంచదార రూ.17 రేటుకు ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేస్తారన్నారు. దుకాణాలకు కేటాయించిన సరుకుల ప్రకారం డీలర్లు డీడీలు చెల్లించాలని, రేషన్ దుకాణాలకు ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి సరకుల సరఫరా జరుగుతుందని తెలిపారు.

పలు పనులకు గ్రామాల్లో శంకుస్థాపన



అన్నవరప్పాడులో అభివృద్ధి పనికి శంకుస్థాపన చేసిన మంత్రి దుర్గేష్

పెరవలి: పల్లె పండుగలో భాగంగా రోడ్ల నిర్మాణానికి రూ.11 కోట్లు మంజూరయ్యాయని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పల్లె పండుగలో భాగంగా పెరవలి, కొత్తపల్లి అగ్రహారం, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు, మల్లేశ్వరం, కడింపాడు, పిట్టల వేమవరం గ్రామాల్లో శుక్రవారం ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంపీడీఓ సీహెచ్ వెంకట రమణ, తహసీల్దార్ అచ్యుత కుమారి, టీడీపీ, జనసే పార్టీల అధ్యక్షులు అతికాల శ్రీను, పిప్పర రవి, అన్నవరప్పాడు సర్పంచ్ పంతం బాలసుందరి చిన్న, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

రహదారులు.. ప్రమాదాలకు నిలయాలు

- దారుణంగా ముక్కామల ఎర్రవంతెన మార్గం
- కనీస మరమ్మతులూ చేపట్టని ప్రభుత్వం
- తరచూ వాహన ప్రమాదాలు



పెరవలి మండలం ముక్కామల రోడ్డుపై ఏర్పడిన గోతులు



అజ్జరం వద్ద ఆర్ అండ్ బీ రహదారిపై గోతుల్లో పడి దెబ్బతిన్న ఆటోకు మరమ్మతులు



ఉండ్రాజవరం మండలం చివటం వెళ్లే జెడ్పీ రోడ్డు

పెరవలి: రహదారులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. అడుగు తీసి అడుగు వేయడానికి వీల్లేనంత అధ్వాన స్థితికి చేరుకున్నాయి. రాకపోకలు సాగించేందుకు వాహన చోదకులు, ప్రయాణికులు నరకం చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా రోడ్లపై ఏర్పడిన గోతుల్లో కనీసం తట్టమట్టి కూడ వేయలేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. మండలంలోని ముక్కామల ఎర్ర వంతెన రహదారి దుస్థితిని చూస్తే ఎవరైనా హడలి పోవాల్సిందే. రోడ్డు ఎక్కడ ఉందో తెలియనంత హీన స్థితిలో ఈ మార్గం ఉంది. ప్రధానమైన నిడదవోలు–నరసాపురం ఆర్ అండ్ బీ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నారే తప్ప, గత 15 ఏళ్లగా ఈ రోడ్డు వేసిందే లేదు. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే పట్టుబట్టి ఈ రోడ్డును వెడల్పు చేయించడంతో పాటు కొత్త రహదారి నిర్మించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ రహదారిపై పడిన గోతులను కనీసం పూడ్చలేదంటే ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో తెలుస్తోంది.

మండలంలో ఇదీ పరిస్థితి

పెరవలి మండలంలో ఆర్ అండ్ బీ రహదారులు సుమారు 49 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. వాటిలో సుమారు ఏడు కిలోమీటర్ల పొడవైన వడలి -ముక్కామల రోడ్డు మాత్రమే ప్రయాణానికి అనుకూలంగా ఉంది. గత ప్రభుత్వంలో సిమెంట్ రోడ్డు వేయడమే ఇందుకు కారణం. మిగిలిన 42 కిలోమీటర్ల రోడ్లూ అడుగుకో గొయ్యి అన్న చందంగా తయారయ్యాయి. గతేడాది కాలంలో మండలంలోని ఆర్ అండ్ బీ రహదారులపై 42 ప్రమాదాలు జరిగాయి. తొమ్మిది మంది మృతి చెందగా, పలువురు క్షతగాత్రులై ఆసుపత్రుల పాలయ్యారు.

చివటం రోడ్డు సొగసు చూడతరమా..

ఉండ్రాజవరం: తణుకు పట్టణం నుంచి చివటం గ్రామం వైపు వెళ్లే జిల్లా పరిషత్ రహదారి పెద్ద పెద్ద గోతులతో ప్రమాదకరంగా తయారైంది. ఈ మార్గంలో అనేక పరిశ్రమలు ఉన్నాయి. వాటికి మెటీరియల్ తరలించడానికి భారీ వాహనాలు వస్తుండడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. వర్షం కురిస్తే ఆ గోతుల్లోకి నీరు చేరుతోంది. గోతుల లోతు ఎంతో తెలియని ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సావరం టీచర్స్ కాలనీ మీదుగా వెళ్లే ఈ రహదారి పాలంగి, సత్యవాడ, వేలివెన్ను, ఉండ్రాజవరం వెళ్ళడానికి దగ్గర మార్గం. దాంతో వాహనాల రద్దీ కూడా ఎక్కువ కావడం వల్ల రోడ్డు పూర్తిగా పాడైపోయింది. ముఖ్యంగా టీచర్స్ కాలనీ సమీపంలోని శ్రీసాయి అంబికా న్యూ టవర్స్ ముందు మలుపు పెద్ద చెరువుగా మారింది. తణుకు పట్టణం దాదాపు కె.సావరం, చివటం, పాలంగి గ్రామాల వైపు విస్తరించడంతో అపార్ట్‌మెంట్లు, ఇండివిడ్యువల్ ఇళ్లు నిర్మించుకుని వేలాది కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. ఫలితంగా ఈ రహదారిలో ట్రాఫిక్ పెరిగిపోవడంతో ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రోడ్డును పూర్తిగా వేసే లోపు కనీసం తాత్కాలికంగానైనా గోతులు పూడ్చించాలని ఈప్రాంత వాసులు జె.వెంకట రామరాజు, కుర్మాల కృష్ణ, బ్రహ్మానందం, పి.శివాజీ, జి.మల్లేశ్వరరావు కోరుతున్నారు.

ప్రధాన రోడ్లపై పశువుల భైఠాయింపు

నిడదవోలు: పట్టణంలోని ప్రధాన రహదారులపై పశువుల సంచారం ఎక్కువైంది. స్థానిక గణేశ్‌చౌక్ సెంటర్, గణపతి సెంటర్, సంత మార్కెట్ ఏరియాల్లో వాటి సంచారం ఎక్కువగా ఉంది. పశువుల యజమానులు నిర్లక్ష్యంగా వాటిని బయటకు వదిలేస్తున్నారు. అవి గుంపులు సంచరిస్తూ పట్టణంలోని ప్రధాన సెంటర్లలో తిష్ట వేస్తున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రోడ్లకు అడ్డంగా గుంపులుగా అవి ఉండడంతో వాహనాలు వెళ్లడానికి అవకాశం లేకుండా పోతోంది. ఒక్కోసారి రోడ్లపై ఉన్న పశువులను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పశువులను తప్పించుకుని వెళ్లేందుకు కొందరు వాహనదారులు హారన్ కొడుతున్నారు. దాంతో పశువులు హడలిపోయి ద్విచక్ర వాహనాలపై పడి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. చాలాకాలంగా యజమానులు తమ పశువులను రోడ్లపై విడిచి పెడుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పట్టణ ప్రజలు మున్సిపల్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదంటున్నారు. రోడ్లపై సంచరించే పశువులు స్థానిక నెహ్రూ నగర్‌కు చెందిన కొందరి రైతులవి అని మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది చెబుతున్నారు. వారికి ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా లెక్కచేయడం లేదని అంటున్నారు. గతేడాది రోడ్లపై సంచరిస్తున్న ఆవులను పట్టుకొని నిర్బంధించారు. అప్పట్లో కొందరి సిఫారసుతో వాటిని విడిచిపెట్టారు. అయినప్పటికీ పశువుల యజమానులు తమ పద్ధతి మార్చుకోలేదు. పట్టణ రోడ్లపై వందకు పైగా పశువులు సంచరించడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.



నిడదవోలు గణేశ్ సెంటర్‌లో ప్రధాన రహదారిపై తిష్ట వేసిన పశువులు

అధిక వర్షాలతో ఆయిల్ పామ్‌కు చేటు

- ఆకులు ఎండిపోయి కుళ్లిపోతున్న చెట్లు
- సస్యరక్షణపై రైతులకు అవగాహన



అయ్యవరంలో ఆయిల్ పామ్ చెట్లకు సస్యరక్షణ చర్యలు సూచిస్తున్న ఉద్యానశాఖాధికారి బబిత

నల్లజర్ల: ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలు ఆయిల్‌పామ్ చెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. చాలా గ్రామాల్లో కాండం కుళ్లుతో చెట్లు ఎండిపోయి చనిపోతున్నాయి. దీనిపై నల్లజర్ల ఉద్యానశాఖాధికారి ఎం.బబిత శుక్రవారం అయ్యవరంలో రైతులు, రైతు సేవాకేంద్ర సిబ్బంది, త్రీ ఎఫ్ ఆయిల్‌పామ్ సంస్థ ప్రతినిధులకు క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ తెగులు ముందుగా ఆకులకు మచ్చలు ఏర్పడి అవి కుళ్లిపోయి అన్ని ఆకులకూ వ్యాపించిన అనంతరం కాండంలోకి విస్తరిస్తుందన్నారు. ఆ సమయంలో చెట్టువద్ద విపరీతమైన దుర్వాసన వస్తుందన్నారు.

నివారణ ఇలా...

ప్రాథమిక దశలో గుర్తించి సాఫ్ లేదా కివాచ్ ఒక మిల్లీ లీటరు మందును లీటరు నీటికి చొప్పున కలిపి 15 రోజులకొక సారి ఆకులపై పిచికారీ చేయాలని బబిత సూచించారు. తెగులు కాండంలోకి వ్యాప్తి చెందినపుడు ఆ కుళ్లిన భాగాన్ని తొలగించి కార్బండైజం, మోనోక్రోటోఫాస్‌ను పేస్టులా కలిపి పూతలా పూయాలన్నారు. చుట్టుపక్కల చెట్లపై బ్లీచింగ్ నీటిలో కలిపి కింద,పైన పిచికారీ చేయాలన్నారు. కాండానికి ప్లాంటోమైసిన్ రెండు గ్రాములు, ప్రాపికోనజోల్ 5 మిల్లీలీటర్ల మందును ఇంజక్షన్‌గా ఇస్తే చెట్లు త్వరగా కోలుకుంటుందన్నారు. వేరు మందు పెట్టడం ద్వారా ఉపయోగం ఉంటుందన్నారు. దీనికి హెక్సాకొజోల్ 5 ఎంఎల్, స్ట్రెప్టోమైసిన్ 2 గ్రాములు 100 ఎంఎల్ నీటిలో కలిపి చిన్న సంచిలో పోసి వేరుకు కట్టాలన్నారు.అధిక నీరు కట్టకుండా డ్రిప్ ద్వారా నీరు పెడితే ఇతర చెట్లకు తెగులు వ్యాప్తి చెందకుండా ఉంటుందన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు పలువురి ఎంపిక



కలవలపల్లిలో విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



ఎంపికైన కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు

చాగల్లు: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని కలవలపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ముగ్గురు ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జొన్నకూటి వెంకట శ్రీనివాస్ తెలిపారు. ఏలూరులోని ఏఎస్ఆర్ స్టేడియంలో గురువారం నిర్వహించిన స్కూల్ గేమ్స్ జిల్లాస్థాయి అండర్- 14 బాలికల వాలీబాల్ ఎంపిక పోటీల్లో ఈ పాఠశాల విద్యార్థినులు పంతకాని లాస్య, కానుబోయిన తేజ, తాడేపల్లి వెన్నెల చక్కటి ప్రతిభ చూపారు. దాంతో నవంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఈ ముగ్గురూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని హెచ్ఎం వెంకట శ్రీనివాస్ తెలిపారు.ఆ విద్యార్థినులకు, వారికి కోచింగ్ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు కొయ్య గంగాధరరావును పలువురు అభినందించారు.

కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి..

కొవ్వూరు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారు. ఏలూరులోని సీతారామరాజు స్టేడియంలో గురువారం జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల వాలీబాల్ అండర్- 14 విభాగంలో యు.ప్రవీణ్, అండర్- 17 విభాగంలో కె.మంజుల, వై.ప్రమీల సత్తా చాటారు. దాంతో వారు ముగ్గురు త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ఆ పాఠశాల హెచ్ఎం వి.శ్యాంసన్ శుక్రవారం తెలిపారు. వారిని పీఈటీ ఎస్.భాస్కర్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు కూచిపూడి దుర్గా తదితరులు అభినందించారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు మృతి

తాళ్లపూడి: వేర్వేరు కారణాలతో ఆత్మహత్యాయత్నం చేసిన ఇద్దరు వ్యక్తులు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు. తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బల్లిపాడుకు చెందిన కొడమంచిలి అబ్రహం (53)కు అప్పులున్నాయి. ఈ క్రమంలో అతడు మానసికంగా కూడా కొంత ఇబ్బంది పడుతున్నాడు. రోజూ మద్యం తాగి వచ్చి భార్య నాగమణితో గొడవ పడేవాడు. ఈ నెల 12వ తేదీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో అతడు మద్యం తాగి ఇంటికి వచ్చాడు. భర్త తనను కొడతాడనే భయంతో నాగమణి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయింది. కొంత సమయం తర్వాత ఆమె ఇంటికి వచ్చి చూడగా, అబ్రహం వాంతులు చేసుకుంటూ కనిపించాడు. ఏం జరిగిందని నాగమణి భర్తను అడిగితే అప్పుల బాధలు, ఇంట్లో సమస్యలు భరించలేక పురుగు మందు తాగానని అబ్రహం బదులిచ్చాడు. బంధువుల సహాయంతో అతడిని నాగమణి చికిత్స నిమిత్తం తొలుత కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలించింది. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి మార్చారు. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం అబ్రహం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి, మృతుడి భార్య ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు తాళ్లపూడి ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బ్లేడ్‌తో పీక కోసుకుని..

కుటుంబ తగాదాల నేపథ్యంలో మండలంలోని రావూరుపాడుకు చెందిన పుప్పాల హర్ష గణపతి (32) అనే వ్యక్తి భార్యతో గొడవ పడ్డాడు. దాంతో ఆమె తన పుట్టింటికి కోరుకొండ వెళ్లిపోయింది. మనస్థాపం చెందిన గణపతి గురువారం మద్యం తాగిన మత్తులో బ్లేడుతో పీక కోసుకున్నాడు. తీవ్రంగా రక్తస్రావమైన అతడిని ఇతర కుటుంబ సభ్యులు గమనించి వైద్య సహాయం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు శుక్రవారం మృతి చెందాడు. స్థానిక ఎస్సై రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక రవాణాలో సాంకేతిక సమస్యలు పరిష్కరిస్తాం

- జిల్లా కలెక్టర్ ప్రశాంతి
- వాడపల్లి ఇసుక ర్యాంపు పరిశీలన



వాడపల్లి ఇసుక ర్యాంపులో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

కొవ్వూరు: ఇసుక సరఫరాలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి.ప్రశాంతి ప్రకటించారు. మండలంలోని వాడపల్లి ఇసుక ర్యాంపును శుక్రవారం ఆమె పరిశీలించారు.ఇసుక సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని, అడ్డంకులను అధిగమించేందుకు ఆఫ్‌లైన్ విధానాన్ని అనుసరించాలని ఆమె ఆదేశించారు. ఇసుక బుకింగ్, రవాణా వ్యవస్థ వరకూ ఎలాంటి ఆటంకం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంకేతిక సమస్యలతో ఆన్‌లైన్ ఇసుక బుకింగ్ జరగనందున జిల్లా జాయింట్ కలెక్టర్ ద్వారా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. వినియోగదారులకు సాధ్యమైనంత ఎక్కువ ఇసుక అందుబాటులోకి తీసుకుని రావాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి అధికారులను అప్రమత్తం చేస్తామన్నారు. ఇసుక ర్యాంపులకు సమీపంలోని సచివాలయాల ద్వారా టోకెన్‌లు జారీ చేస్తామన్నారు. బోట్స్‌మెన్ సొసైటీలకు బకాయిపడిన లోడింగ్ చార్జీలు తక్షణం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇసుక ఆన్‌లైన్ వే బిల్లుల జారీ విధానంలోని లోపాల గురించి సిబ్బందిని కలెక్టర్ ప్రశాంతి అడిగి తెలుసుకున్నారు.జీపీఆర్ఎస్ విధానం పెద్ద సమస్యగా ఉంటోందని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తెచ్చారు. లారీ ఇసుక ర్యాంపునకు వచ్చినప్పటికీ జీపీఎస్‌లో 20, 30 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్టు చూపిస్తున్నందున బిల్లులు జనరేట్ కావడం లేదన్నారు. ఆర్డీవో రాణి సుస్మిత, తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్, ఇతర సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా శుక్రవారం రెవెన్యూ గ్రామ సభలు ప్రారంభం అయ్యాయి. మండలంలోని చిడిపి గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి భూ సమస్యలనైనా పరిష్కరించేలా గ్రామసభల్లో చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత తహసీల్దార్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లదే అని కలెక్టర్ స్పష్టం చేశారు. చిడిపి గ్రామంలో రైతుల నుంచి భూ సమస్యలపై 18 అర్జీలు అందాయన్నారు. ఆర్డీవో రాణి సుస్మిత, తహసీల్దార్ ఎం.దుర్గా ప్రసాద్, సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు, పాల్గొన్నారు.

హిందూ ధర్మంలోకి ఆరు కుటుంబాలు



హిందూ ధర్మం స్వీకరించిన కుటుంబాలను సాదరంగా ఆహ్వానిస్తున్న వీహెచ్‌పీ నేతలు

నల్లజర్ల: ముసుళ్లగుంట గ్రామ ఎస్సీ కాలనీలో ఆరు కుటుంబాల వారు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం హిందూ ధర్మంలోకి పునరాగమనం చేశారు. పరిషత్ ఆల్ ఇండియా లీగల్ సెల్ కమిటీ సభ్యుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హోమాలు నిర్వహించారు. హిందూధర్మం స్వీకరించిన వారికి పరిషత్ జిల్లా కార్యదర్శి గంగాధర్, గోరక్షక విభాగం కార్యదర్శి సుబ్బారాయుడు పట్టుపంచె, చీర, జాకెట్టు, భగవద్గీత గ్రంథం, వేంకటేశ్వర స్వామి ఫొటో, గంగాజలం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల శాఖ అధ్యక్షుడు కందుల రవిశేఖర్, ఉండ్రాజవరపు వెంకటరత్నం, అల్లాడ రామకృష్ణ, నందమూరి రామకృష్ణ, నాగమణి, వెంకట్, సవలం రామకృష్ణ పాల్గొన్నారు.

పలుచోట్ల రెవెన్యూ గ్రామ సభలు



వేలివెన్ను గ్రామసభలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఉండ్రాజవరం తహసీల్దార్ ప్రసాద్



దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామసభలో అర్జీ అందిస్తున్న రైతు

ఉండ్రాజవరం: పొలాల రీ సర్వేపై భూ యజమానుల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ సూచించారు. మండలంలో వేలివెన్ను గ్రామంలో శుక్రవారం రీసర్వే గ్రామసభ నిర్వహించారు. అలాగే మండలంలోని దమ్మెన్నులో శనివారం, చిలకపాడులో సోమవారం, సూర్యారావుపాలెంలో మంగళవారం, చివటంలో బుధవారం, వెలగదుర్రులో గురువారం, పాలంగి, కె.సావరంలో శుక్రవారం, కాల్ధారిలో సోమ, మంగళవారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామాల్లో రీసర్వే గ్రామసభలు నిర్వహిస్తారన్నారు.

తాళ్లపూడి: తహసీల్దార్ బి.రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో తాడిపూడి పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో వారం రోజుల పాటు గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ భారతి మాట్లాడుతూ గతంలో భూ సమస్యలపై వచ్చిన కొన్ని ఫిర్యాదులను స్వీకరించామని, గతంలో పరిష్కారం కాని సమస్యలను కూడా మళ్లీ పరిశీలిస్తామని తెలిపారు.

దేవరపల్లి: మండలంలో నిర్వహించిన భూముల రీసర్వేపై అర్జీలను స్వీకరించడానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. శుక్రవారం మండలంలోని గౌరీపట్నం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆమె మాట్లాడారు. ఈ సభలో ఏడు ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిలో రీసర్వే కోసం నాలుగు, ఆర్ఓఆర్ కోరుతూ నాలుగు అర్జీలు ఉన్నట్టు తెలిపారు. సర్పంచ్ రాయి అన్నపూర్ణ, ఉప సర్పంచ్ ఆండ్రు రమేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పు మాదిగ వర్గాలకు వెలుగు

నల్లజర్ల: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అణగారిన వర్గాలకు ఓ వెలుగు అని ఏపీ ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షుడు బొబ్బిలి వెంకట్రాజు అన్నారు. ఎమ్మార్పీఎస్ మండల స్థాయి సమావేశాన్ని శుక్రవారం అచ్చన్నపాలెంలో కాకర్ల కల్యాణ మంటపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్రాజు మాట్లాడుతూ ఇంతకాలం రిజర్వేషన్లు దక్కక మాదిగలు విద్య, ఉద్యోగావకాశాలను కోల్పోయారన్నారు. ఈ తీర్పు మాదిగ జాతిలోను, ఉప కులాల్లోనూ వెలుగు నింపుతుందన్నారు. ఉప సుప్రీం కోర్టు ఉత్తర్వులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూచ తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు కూనపాం రమణ, సువర్ణరాజు, రత్నం,పెనుమాక వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఏర్పాటు

ఏపీ ఎమ్మార్పీఎస్ నల్లజర్ల మండల శాఖ ఏర్పాటైంది. అధ్యక్షుడిగా మర్రి శోభన్‌బాబు, ఉపాధ్యక్షుడిగా తాడిగడప వెంకట్రావులతో పాటు 10 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.